ఆసుపత్రికి వెళ్ళి పింఛన్ అందజేత

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ పింఛను లబ్ధిదారుడుకు వలంటీర్ రాగోల్ జేమ్స్ ఆసుపత్రికి వెళ్ళి పింఛను అందజేసిన ఘటన బుధవారం మండలం చీపుర్లపాడు పంచాయతీలో చోటు చేసుకుంది. ఊడికలపాడు గ్రామం ఎస్సీవిధికి చెందిన తోట భాస్కరరావు ఆరోగ్యం బాగలేక జేమ్స్ ఆసుపత్రితిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ సర్పంచ్ నేతింటి చిన్నమ్మదు అప్పలస్వామిలు తోట బాస్కరరావుకు అసుపత్రికి వెళ్ళి పింఛన్ అంద జేయాలని వాలంటీరు సదునుపల్లి వెంకటరావును కోరారు. దీంతో రాగోల్ జేమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భాస్కరరావుకు వలంటీరు వెంకట రావు పింఛన్లు నగదును అందజేశారు.

ఘనంగా భౌతిక శాస్త్రవేత్త 'న్యూటన్' జయంతి వేడుకలు

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం భౌతిక శాస్త్రవేత్త, ఐజాక్ న్యూటన్ జయంతి వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్, డా.పి.లత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూటన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భౌతిక శాస్త్ర అధ్యాపకులు, పేడాడ ఢిల్లేశ్వరరావు మాట్లాడుతూ న్యూటన్ ప్రతిపాదించిన సిద్ధాంతములు ఆధారంగానే నేటి అంతరిక్ష పరిశోధనలు, రాకెట్ల వినియోగం, కృత్రిమ ఉపగ్రహాలు తదితర ఆధునిక రంగాల పురోభివృద్ధి సాధించగలిగారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, డా.పి.అన్నాజీరావు, త్రినాధరావు, వేంకటేశ్వరరావు, సోమేశ్వరరావు, రెయ్యిమ్మ, అనూష, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వైఎస్సార్ భీమా

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం పొత్రఖండ పంచాయతీ జగతికేశుపురం గ్రామంలో పితాంబరం అనే వ్యక్తి ఇటీవల అకాల మరణం చెందడంతో ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు బుధవారం ఆకుటుంబాన్ని పరామర్శించి బాధితులకు వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సహాయంగా పదివేల రూపాయలు అంద జేశారు. సర్పంచ్ బేసి ఖగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, దశరథ, తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటల ద్వారా రైతులకు ఎంతో మేలు : ఆర్టీవో

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : అంతర పంటల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా ఆర్టీవో హేమ సుందర్ అన్నారు. బుధవారం లక్ష్మీపురం సవరపేట గ్రామాల్లో రైతులు పండి స్తున్న ఆర్గానిక్ పంటలను పొలాలని ఉత్పత్తులను పరిశీలించారు. రైతులు అంతర పంటల ద్వారా గణనీయమైన లాభాలను పొందవచ్చునని అలాగే ఏడాది కాలం వివిధ రకాలు పంటలు పండించ వచ్చునని అన్నారు. గేదెల గౌరి చెరుకు పొలం దగ్గర 200 లీటర్ల జీవామృతం తయారుచేశారు. కె.ఉష, వాతాదరోజా. కార్యక్రమంలో రైతులు తంగి వెనమ్మ, సూర్యనారాయణ, సింహాచలం, పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో 'అక్రమ' షాపింగ్ నిర్మాణం

'స్పందన'లో ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-నరసన్నపేట : ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వాణిజ్య సముదాయాలు నిర్మాణం చేసినా పంచాయితీ, రెవెన్యూ యంత్రాంగం కన్నెత్తి చూడకపోవటంతో ఆక్రమణలకు అడ్డు లేకుండా పోతుంది. కనిపించిన ప్రభుత్వ స్థలాన్ని అక్రమించి, అక్రమంగా షాపింగ్ నిర్మాణాలు చేసినా, సంబధిత అధికారులు మౌనం వహించటం అక్రమణదారుడుకు సహకరించటమే అవుతోందని పలువురు విమర్శలు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని వీరన్నాయుడు కాలనీ సమీపంలో వున్న శ్రీ సంతోషిమాత ఆలయం ఎదురుగా వున్న ప్రభుత్వ భూమిలో ఎటువంటి ప్లాన్ అప్రూవల్ లేకుండా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయటం నేడు వివాదానికి దారి తీస్తుంది. ఈ విషయమై గత సంవత్సరం ఆగస్టు నెల 6వ తేదీన నరసన్నపేట మండలం, ముషిడిగట్టు పంచాయితీ అంబోజీపేట గ్రామానికి చెందిన వైష్ణవి పండా స్పందనలో ఫిర్యాదు చేయగా, సంబంధిత రెవెన్యూ అధికారులు సమాధానమిస్తూ, బొరిగివలస రెవెన్యూ రికార్డులు పరిశీలించగా లబ్ధిదారుడు పేర్కొన్న భూమి సర్వే నెంబర్-18పార్ట్ గ్రామ కంఠంగా నమోదు కాబడి వుందని తెలి పారు. ఈ విషయంపై పంచాయితీ తుది నిర్ణయం తీసుకోవలసి వుందని వైష్ణవి పండాకు ఎండార్స్‌మెంట్ ద్వారా తెలియచేశారు. దీనితో పాటు గత సంవత్సరం డిసెంబర్ నెల, 23వ తేదీన వీరన్నాయుడు కాలనీకి చెందిన రాజేష్‌కుమార్ పండా సమాచార హక్కు చట్టం క్రింద శ్రీకాకుళం పట్టణాభివృద్ధి సంస్థ(సుడా)కు ప్రభుత్వ స్థలంలో షాపింగ్ కాంపెక్స్ నిర్మాణానికి ఎలా ప్లాన్ అప్రూవల్ చేశారని స్పందనలో ధరఖాస్తు చేశారు. ఈ విషయమై సంబంధిత సుడా పౌర సమాచార అధికారి నరసన్నపేట పంచాయితీ పరిధిలో వున్న శ్రీ సంతోషిమాత ఆలయం ఎదురుగా వున్న స్థలానికి ఎటువంటి నిర్మాణ అనుమతులు మంజూరు చేయలేదని సమాధానమిచ్చింది. ఇలా ప్రభుత్వ స్థలంలో సుడా అనుమతులు లేకుండా అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేసుకొని జీవనం సాగిస్తున్న నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ, పంచాయితీ ఎందుకు తాత్సారం చేస్తోందో వివరణ ఇవ్వాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

గిరి శిఖర గ్రామాల్లో గడప గడపకు రెడ్డి శాంతి

విశాలాంధ్ర-హిరమండలం: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం 117వ రోజు హిరమండలం మండలం మర్రిగూడ గ్రామ సచివాలయం పరిధిలోని పెద్దగూడ గ్రామ పంచాయితీలోని గేసరిగూడ, చీడిమానుగూడ, జన్నడ గూడ, పొల్లం గూడ, ఎగువగూడ, పెద్దగూడ, బలదగూడ, పాంద్ర మానుగూడ, గొలుసుమాను గూడ గిరిశిఖర గిరిజన గ్రామాల్లో పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యురాలు రెడ్డి శాంతి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మూడేళ్ల సంక్షేమ పాలనలో గిరిజన లబ్దిదారులకు చేకూరిన లబ్దిని వివరించారు. ఈకార్యక్రమంలో భాగంగా నూతన సంవత్సర కానుకగా జగనన్న ప్రభుత్వం పెంచి ఇస్తున్న పింఛన్లను పెన్షన్ దారులకు రెడ్డి శాంతి అందజేశారు. పెద్దగూడ పంచాయతీ కొండూరు లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (గిరిజన సంక్షేమ) సందర్శించి పూర్తి అయిన నాడు -నేడు పనులను పరిశీలించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పెద్దగూడ గ్రామం నందు గిరిజనులతో కలిసి శాసన సభ్యురాలు రెడ్డి శాంతి అల్పాహారం సేవించారు. ఈ కార్యక్రమంలో హిరమండలం మండల వైస్సార్సీపీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ, సచివాలయకన్వీనర్ లు బూర శ్రీనివాస్, కె పాల్గున రావు, ఉప సర్పంచ్ వి బాలరాజు, పెద్ద గూడ ఎంపీటీసీ ఎస్ శ్రీదేవి, సర్పంచ్, సచివాలయం కన్వీనర్ లు వార్డు సభ్యులు, గ్రామ వాలంటీర్లు పలు శాఖాధికారులు, మర్రిగూడ గ్రామ సచివాలయ సిబ్బంది వాలంటీర్లు, హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట మండలాల పలువురు ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ రీజనల్ స్పోర్ట్స్ మీట్

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : శ్రీకాకుళంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్, మహిళా పాలిటెక్నిక్ కళాశాలలు సంయుక్తంగా రీజనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ను గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తామని కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ జి దామోదరరావు తెలిపారు. ఈ స్పోర్ట్స్ మీట్లో పది పాలిటెక్నిక్ కళాశాల నుంచి 472 మంది క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. ఆరు గేమ్స్, 13 స్పోర్ట్స్ నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని మృతి

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని బైరిపురం నక్కవోడి చెరువు గట్టున ఉండే మర్రి చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందినట్లు ఎస్సై కే.రాము తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బైరిపురం నక్కవోడి చెరువు గట్టున ఉండే మర్రి చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందినట్లు సమాచారం తెలియడంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడు ఒరిస్సాకు చెందిన వ్యక్తిగా పోలికలు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఇచ్చాపురం ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించినట్లు తెలిపారు. మృతుని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పోలీసు కుటుంబాలకు నగదు చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తు అనారోగ్యంతో మరణించిన పోలీసు ఉద్యోగి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరైన నగదు చెక్కులను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక అందజేశారు. జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తు గత నెలలో అనారోగ్యంతో మరణించిన పోలీసు హెడ్ కానిస్టేబుల్ కెవి రామ కృష్ణ కుటుంబ సభ్యులకు రూ.75వేలు ప్రభుత్వం నుంచి మంజూరు కాబడిన విడో, ఫ్లాగ్ ఫండ్ నగదు చెక్కులను జిల్లా ఎస్పీ చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ కుటుంబ నేపథ్యం, పిల్లలు చదువు తదితర అంశాలపై చర్చించి, మీకు మీ కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసు శాఖ ఎల్లవేళల అండగా ఉంటుందని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు రావాల్సిన మిగిలిన ప్రయోజనలు సకాలంలో అందేటట్లు, కారుణ్య నియమము క్రింద వచ్చే ఉద్యోగం కుటుంభం లో ఒకరకు త్వరితగతిన వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని కార్యాలయం సిబ్బందికి ఎస్పీ ఆదేశించారు.

అంపశయ్యపై తెలుగుదేశం పార్టీ

- బాబుకి ఇవే చివరి ఎన్నికలు!
- పింఛన్ల పంపిణీలో తమ్మినేని

విశాలాంధ్ర-ఆమదాలవలస : నలభై ఏళ్ళ ఇండస్ట్రీ అని చెప్పుకుంటూ తిరుగుతున్న చంద్రబాబు ఆయన నడుపుతున్న తెలుగుదేశం పార్టీ అంపశయ్యపై ఉన్నాయని, ఎన్టీఆర్ స్థాపించిన పార్టీని కబ్జాచేసి సైకిల్ గుర్తును సొంతం చేసుకున్నప్పటికీ వచ్చే ఎన్నికలు బాబుకి చివరి ఎన్నికలని శాసనసభాపతి తమ్మినేని సీతారాం జోస్యం చెప్పారు. బుధవారం కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఏఎంసీ ఆవరణలో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాజకీయ చరిత్రపై మాట్లాడారు. తాను ఆ పార్టీలో ఉన్నప్పుడు కూడా మంచిగా నడుచుకోవాలని ఎన్నోసార్లు చెప్పినప్పటికీ తన ఒంటెద్దు పోకడలు ఈడ లేదని ఎద్దేవా చేశారు. ఈసందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సీఎం జగన్ పేదల పక్షపాతి, గొప్ప మానవతావాది అన్నారు. ఎందరు ఏకమైన జగన్ జన సంక్షేమ ప్రభంజనంలో కొట్టుకుపోవడం తప్పదని జోస్యం చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రజల ముంగిటకు నిర్భయంగా, స్వేచ్ఛగా వెళ్లగలిగే స్థాయిని పాలకులకు అందించిన జగన్ రాజనీతిజ్ఞత ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. అనంతరం నూతన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని వెంకట శ్రీరామ చిరంజీవి నాగ్ (నాని), తోగరాం సర్పంచ్ తమ్మినేని వాణీ సీతారాం, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, ఎంపీపీ ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, కమిషనరు ఇంచార్జి బి.లక్ష్మీ నారాయణ, ఎంపీడీఓ ఎం.రేణుక, ఏ.ఈ కె.అప్పలనాయుడు, నాయకులు బి.రమేష్ కుమార్, ఏ.ఉమామహేశ్వరరావు, పి.శ్రీనివాస రావు, డి.సి.ఎం.ఎస్ డైరెక్టర్ బి.నారాయణరావు, బి.చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టెంకూరులో పారిశుధ్య కార్యక్రమం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం మేఘవరం పంచాయితీ టెంకూరు గ్రామంలో, స్థానిక పంచాయితీ సర్పంచ్ పరపటి సునీత శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. కాలువలలో పూడికలు తీయించి, మంచినీటి బావుల వద్ద క్లోరినేషన్ చేయించారు. ఈకార్యక్రమంలో పంచాయితీ వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

భూ రికార్డులు మార్చిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

విశాలాంధ్ర-టెక్కలి : చింతలగార రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబరు 8/2కు సంబంధించిన భూమి రికార్డులను అక్రమంగా మార్చి, భూ కుంభకోణంకు కారకులైన అధికారులపై సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం క్రిమినల్ కేసులు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని సీపీఐ నాయకులు అనపాన షణ్ముఖరావు, యర్ల గోపిలు డిమాండ్ చేశారు. బుధవారం టెక్కలి మండల తహశీల్దార్ కార్యాలయం ముందు చింతలగార భూభాధిత రైతులు సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. 1978లో 13 మంది రైతులు భూమి కొనుగోలు చేసి, నలభై నాలుగేళ్లుగా అనుభవిస్తున్నారని అన్నారు. భూమికి సంబంధం లేని వ్యక్తి పేరిట 1బి, అడంగల్ మార్చి బినామీ రైతులతో అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరుగుటకు ఒక పథకం ప్రకారం రెవెన్యూ అధికారులే వ్యవహ రించారని అన్నారు. వెబ్ ల్యాండ్‌లో ఉన్న పేర్లు తొలగించి బీ బినామీ పేర్లతో అడంగల్, 1బిలు జారీచేసి ప్రభుత్వ నియమనిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై క్రిమినల్ అప్పీల్ నెం.1669/2009 యందు డిసెంబరు 15, 2022వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెబ్ ల్యాండ్ లో తొలగించిన రైతులు పేర్లు బేషరతుగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బినామీ రైతులతో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లు 2652/2020 మరియు 1097/2021 లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇంచార్జీ తహశీల్దార్ కు మెమొరాండం అందించారు. ఈ కార్యక్రమంలో డి.హెచ్.పి.ఎస్. నేత రవి, బాధిత రైతులు తిర్లంగి సత్యం, టి.జోగి నాయుడు, శిగిలిపల్లి రామ్మూర్తి, ఎస్.భాస్కరరావు, గూన వేణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

- జిల్లాలో విభిన్న ప్రతిభా వంతులకు సుమారు 30 వేలు పెన్షన్లు
- డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : విభిన్న ప్రతిభా వంతులకు జిల్లాలో సుమారు 30 వేలు పెన్షన్లు అందిస్తున్నట్లు డిఆర్డిఏ పిడి విద్యాసాగర్ వెల్లడించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన లూయిస్ బ్రెయిలీ 214వ జయంతి వేడుకల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో విభిన్న ప్రతిభా వంతులకు చేపడుతున్న కార్యక్రమాలను ఏ జిల్లాలో చేపట్టడం లేదన్నారు. జిల్లాలో వివిధ కేటగిరీలకు చెందిన విభిన్న ప్రతిభా వంతులకు సుమారు 30వేల పెన్షన్లు ఇస్తున్నట్లు వివరించారు. ట్రైసైకిళ్ల అడిగిన వెంటనే ఇస్తున్నారని చెప్పారు. విభిన్న ప్రతిభా వంతుల శాఖ ఎడి కిరణ్ మాట్లా డుతూ లూయిస్ బ్రెయిలీ 214వ జన్మదినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో విభిన్న ప్రతిభా వంతులకు 239 పోస్టులు కేటాయించగా ఇందులో 132 పోస్టులు విహెచ్ కు కేటాయించినట్లు చెప్పారు. 39 లాప్‌టాప్‌లు అందించినట్లు వివరించారు. 800 బస్ పాస్‌ల అందించినట్లు తెలిపారు. విభిన్న ప్రతిభా వంతులకు జాబ్ మేళాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. దివ్యాంగులకు సంబంధించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో బ్లైండ్ స్కూల్ ఏర్పాటుకు సంబంధిత అధికారులతో మాట్లాడనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు రంగారావు మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ అందుల ఆశాజ్యోతి అని కొనియాడారు. విభిన్న ప్రతిభా వంతులు అసోసియేషన్ అధ్యక్షుడు అప్పలనాయుడు అధికారులు అందిస్తున్న సహాయ సహకారాలు గూర్చి మాట్లాడారు. విహెచ్ విద్యా ర్థిని యశోధ, శ్రీనివాసరావు, తదితరులు ప్రత్యేక పాటలు పాడి అలరించారు. విభిన్న ప్రతిభా వంతులు మాట్లాడుతూ బ్లైండ్ స్కూల్, నిరుద్యోగ బ్లైండ్ యువతకు వసతిగృహం ఏర్పాటు చేయాలని కోరారు. అంతకు ముందు లూయిస్ బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బ్రెయిలీ కేలండర్‌ను ఆవిష్కరించారు. ఆటలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈసమావేశంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీనివాసరావు, సెట్ శ్రీ సిఇఓ ప్రసాదరావు, నెహ్రూ యువ కేంద్రం అధికారి శ్రీనివాసరావు, పర్యాటక అధికారి నారాయణరావు, విభిన్న ప్రతిభా వంతులు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలు, సభలు, రోడ్‌షోలు సమావేశాల అనుమతులు నిరాకరిస్తూ జీవో విడుదల చేయడం దుర్మార్గం

- వెంటనే ఆ జీవోను ఉపసంహరించుకోవాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి

విశాలాంధ్ర-శ్రీకాకుళం : రాష్ట్రంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించుకునేందుకు అనుమతులు నిరాకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బ్రిటీష్ కాలం నాటి చట్టాన్ని తీసుకురావడం దుర్మార్గమని సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి అన్నారు. బుధవారం స్థానిక ఎన్ఆర్ దాసరి క్రాంతిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ౼ఖబస్త్ర వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తుగ్లక్, హిట్లర్ మాదిరిగా నియంత పాలనకు తెరతీస్తున్నారని, ప్రజలు స్వేచ్ఛా హక్కును హరిస్తూ ఈ జీవోను తీసుకురావడం దారుణమని, వెంటనే ఈ జీవోను ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ధర్నాలు నిరసనలు, ర్యాలీలు చేయకుండా అడ్డుకునేందుకు జగన్ దుష్టబుద్ధితో ఆలోచిస్తున్నారని, పోలీసులను ప్రయోగించి ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడం ద్వారా బెదిరింపులకు దిగుతున్నారన్నారు. బ్రిటీష్ కాలంనాటి పోలీసు యాక్ట్‌లో సెక్షన్‌లను ఉదహరిస్తూ అప్రజాస్వామికంగా అర్ధరాత్రి జీవోను ఇవ్వడాన్ని తప్పుపట్టారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేపట్టలేదా. వైఎస్ షర్మిళ చేపట్టలేదా అని ఆయన ప్రశ్నించారు. కందుకూరు, గుంటూరుల్లో జరిగిన సంఘటనలను చూపిస్తూ ఇలాంటి తప్పుడు నిర్ణయం తీసుకోవడం దారుణమని, వెంటనే ఈ జీవోను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చాపర సుందర్‌లాల్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, ఏఐటీయుసీ జిల్లా గౌరవ సలహాదారు చిక్కాల గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చాపర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ఉద్దనం ప్రాంతంలో కిడ్నీ వ్యాధి బారిన పడి అవస్థలు పడుతున్న కుటుంబాలు చాలానే ఉన్నాయి. కవిటి మండలం లో బొరివంక పంచాయతీ బొగిడియాపుట్టిగ గ్రామానికి చెందిన చెన్నూరు జగన్నాథ్ అతని తల్లి ఇద్దరు కిడ్నీ వ్యాధి బారిన పడ్డారు. దాంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక బెల్లుపడ యూత్ అసోసియేషన్ జగన్నాథ్ కు చేయూతనిచ్చింది. ఇక్కడకు వచ్చిన కిడ్నీ బాధితునికి బుధవారం బెల్లుపడ యూత్ అసోసియేషన్ సభ్యులు పది వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఇబ్బందుల్లో ఉన్న వారికి తమ వంతు సహాయం చేయటం సంతృప్తి కలిగిస్తుందని అసోసియేషన్ సభ్యులు అన్నారు.

జీవోలతో టీడీపీ గెలుపును ఆపలేరు : రామ్‌మల్లిక్ నాయుడు

విశాలాంధ్ర-రణస్థలం: కుప్పం నియోజకవర్గంలో తెదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పర్యటనను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ, చీకటి జీవో ను వెంటనే రద్దు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుప్పంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై లాఠీచార్జిని ఖండిస్తున్నామని అన్నారు. చీకటి జీవోలు తెచ్చి టీడీపీ గెలుపును ఆపలేరన్నారు. ప్రజల మనోభావాలు దెబ్బతీస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ సమావేశంలో మండల నాయకులు, కార్యకర్తలతో రణస్థలం హెడ్ క్వార్టర్స్‌లో నల్ల బ్యాడ్జీలతో ర్యాలీగా నిరసన తెలుపుతూ, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు.

ధాన్యం మిల్లర్ల దోపిడీ

- నిలువునా అన్యాయమవుతున్న రైతులు
- మౌనం దాల్చిన అధికార యంత్రాంగం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మండలంలో ధాన్యం రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు చోటు లేకుండా అడ్డుకునేందుకు కొత్తగా పలు మార్పులు తీసుకు వచ్చినప్పటికి పలువురు అధికారుల సహకారంతో మిల్లులో ధాన్యం దోపిడీ ఏమాత్రం అరికట్టే పరిస్థితి లేకుండా పోయింది. బస్తా ధాన్యం 80 కిలోలు లెక్కింపు కాగా రెండు కిలోలు అదనంగా మిల్లర్లు వసూలు చేస్తున్నారు. ఇదిలా సాధ్యమంటూ కాస్త లోతుగా పరిశీలిస్తే ఆసక్తి కరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. దీని పట్ల వరి పండించిన రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతూ ధాన్యం మిల్లుల వద్ద ప్రతిరోజు మిల్లర్లకు, రైతులకు వాగ్వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. అక్రమాలకు సంబంధించి వివరాల్లోకి వెళితే రైతు భరోసా కేంద్రం నుంచి ప్రారంభమయ్యే ధాన్యం సేకరణలో ముందుగా ధాన్యం క్వాలిటీని పరిశీలిస్తున్నారు. తేమశాతం 17 దాటకుండా ఉన్నట్లయితే అటువంటి ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అనుమతి ఇస్తున్నారు. నాణ్యమైన ధాన్యంతీసుకుని ట్రాక్టర్ల ద్వారా ముందుగా కంచిలి మండలంలో ప్రైవేటు తూకపు యంత్రం వద్దకు వెళ్తున్నారు. అక్కడ తూకం వేయించి ట్రక్‌షీట్ వారి నుంచి తీసుకుని ధాన్యం మళ్లీ రైతు భరోసా కేంద్రానికి అందిస్తే దాన్ని అప్‌లోడ్ చేయడం ద్వారా ఉన్నతస్థాయి నుంచి ఆన్‌లైన్‌లో కొన్ని గంటల సమయంలో ధాన్యం ఏమిల్లుకు తరలించాలన్నది తెలియజేస్తున్నారు. ఆ విధంగా మిల్లు వద్దకు వెళ్లి అన్‌లోడ్ చేసిన తర్వాత అక్రమాలకు అక్కడే శ్రీకారం జరుగుతుంది. వాస్తవంగా తూకపు యంత్రం ద్వారా తూయబడిన ధాన్యం బరువును పరిగణనలోకి తీసుకోకుండా ధాన్యం కొనుగోలు ఏజెన్సీలు 80 కిలోలకు రెండు కిలోలు తగ్గింపు లెక్క వేసి ఆ మొత్తాన్ని ఎఫ్‌టీఓ జనరేట్ చేస్తున్నారు. ఉదాహరణకు ఒక రైతు 5 టన్నుల ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తే సుమారు 140 కిలోలు తగ్గించి 4860 కిలోలకు ఎఫ్‌టిఓ జనరేట్ చేస్తున్నారు. ఈ అదనపు మొత్తం మిల్లర్లకు లాభంగా చూపిస్తున్నారు. ఈవిధంగా రైతులు విపరీతంగా నష్టపోయి లబోదిబోమంటున్నారు. పరిస్థితులు మారకపోవడంతో సోంపేట పట్టణంలోని మిల్లు వద్ద బుధవారం రైతుకు, మిల్లర్లకు తగాదా నెలకొనడంతో కంచిలి ఎంపిపి పైల దేవదాసురెడ్డి మిల్లు వద్దకు చేరుకుని వివిధ అంశాలపై మిల్లు యజమానులను నిలదీయడంతో పరిస్థితి కొంత మేరకు సద్దుమణిగింది. ఇంత ఘోరం జరుగుతున్నా ఏ ఒక్కరూ అక్రమాలను నివారించకపోవడం దురదృష్టమని రైతులు వాపోతున్నారు.

సీపీఐ పార్టీ 98వ ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాలు

విశాలాంధ్ర-పలాస : మండలం కేదారిపురంలో సీపీఐ పార్టీ 98వ ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు చాపర వెంకటరమణ ఆధ్వర్యంలో శాఖా కార్యదర్శి పి.కేశవ జెండా ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రద్యమ కాలం నుండి నేటివరకు బడుగు బలహీన వర్గాల కోసం కార్మికులు, రైతులు కోసం అణచివేతకు వ్యతిరేకంగా పాలక వర్గాలతో నిరంతరం పోరాడి హక్కులు సాధించుకున్న పార్టీగా సీపీఐ ఉందని పలాస నియోజకవర్గంలో ప్రత్యామ్నాయ పార్టీగా అవతరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, తిరుపతి ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జగన్ రూపంలో రాక్షస పాలన : గౌతు శిరీష

విశాలాంధ్ర-పలాస: కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు నాయుడుని అడ్డుకోవడం రాక్షస పాలనకు నిదర్శనమని, పథకం ప్రకారం అల్లర్లు సృష్టించి చీకటి జి.ఒలు ఇచ్చి ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. జగన్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువులకు తిలోదాకాలు ఇచ్చి ప్రతిపక్షల అణిచివేతకు గురిచేస్తుందని, చంద్రబాబు నాయుడు సభలకు వచ్చే ప్రజా స్పందన చూసి ఓర్వలేక అప్రజాస్వామికంగా జి.ఒ.నెం.1 తీసుకువచ్చాం అన్నారు. పోలీసులు జగన్ రెడ్డి కనుసన్నల్లో పనిచేయడంతో చంద్రబాబు సభకు సరైన భద్రత కల్పించకపోవడమే తొక్కిసలాటకు కారణమన్న విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి కొత్త నాటకానికి జగన్ ప్రభుత్వం తెరలేపిందన్నారు. ప్రశ్నించే ప్రతి గొంతును నొక్కే ప్రయత్నం చేస్తుందని, జగన్ రెడ్డి చెప్పినట్లు పోలీసు వ్యవస్థ వ్యవహరించడం బాధాకరం. ప్రజలు అంతా గమనిస్తున్నారన్నారు. తొందరలో వైసిపి నాయకులకు రోడ్లమీద తిరగకుండా చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు మరోసారి బ్రిటీష్ పాలన గుర్తుచేస్తున్నారన్నారు. జగన్మోహన రెడ్డి చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన అడ్డుకోవడాన్ని టీడీపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

బాలల హక్కుల కమిషన్‌కు మేధావులు సూచనలు అందించండి

కమిషన్ సభ్యులు గొందు సీతారాం

విశాలాంధ్ర-అరసవల్లి/ఎచ్చెర్ల: లోక్‌సభ, రాజ్య సభల సమన్వయంతో నిర్మితమైన చట్టబద్ధ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపి ఎస్సిపిసిఆర్)కు మేధావులు, ప్రొఫెసర్లు, నిష్ణాతులు, ప్రభావశీలుర అభిప్రాయాలు, సలహాలు, సూచనలు అందించి దేశంలో అన్ని రాష్ట్రాల బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ల కంటే ఆంధ్ర ప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పేరు, ప్రతిష్టలు ఇనుమడింప చేసేలా సహకరించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొందు సీతారాం శ్రీకాకుళం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యునివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావును కోరారు. బుధవారం పట్టణంలోని పి.ఎన్.కోలనీ వి.సి.బంగ్లాలో ఆయనతో సీతారాం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కు సంభందిత వివిధ అంశాలు, చట్టాలు, సుమోటాలుగా స్వీకరిస్తున్న కేసులు, అంశాలు, ఆదేశాలు అమలుపై సునిశిత దృష్టి, కమిషన్ నుండి ప్రభుత్వానికి అందిస్తున్న ప్రతిపాదనలు, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల సారథ్యంలో నిర్వహిస్తున్న సమావేశాలు, వాటి పురోగతిపై ఇరువురు చర్చించారు. అనంతరం వైస్ ఛాన్సలర్ నిమ్మ వెంకట్రావు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పదవీ భాద్యతలు చేపట్టాక చక్కని పనితీరు,ప్రతిభను కనబరుస్తూ బాలల్లోను, వారి తల్లిదండ్రుల్లో నైతిక స్థైర్యం, ధైర్యం నింపుతున్నారన్నారు. కమిషన్ సభ్యులు గొందు సీతారాం ప్రతిపాదించినట్టు త్వరలో తమ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ప్రొఫెసర్లు, అధ్యాపకులు, ఇతర రంగాల నిష్ణాతులతో సమావేశాన్ని ఏర్పాటుచేసి చక్కని సలహాలు, సూచనలు, అభిప్రాయాలను పొందుపరచి తమ వంతుగా కమిషన్ పురోభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. అనంతరం కమిషన్ సభ్యులు గొందు సీతారాం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని విశ్వ విద్యాలయాల వైస్ ఛాన్సలర్ లతో సమావేశమై వారి సూచనలు సలహాలుతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రతిష్టను దేశవ్యాప్తంగా పెంచే ప్రయత్నం చేస్తామని అన్నారు. వైస్ ఛాన్సలర్ ను కలిసిన వారిలో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర కో కన్వీనర్ పి.శేఖర్, ఫోరం శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మొదలవలస వాసుదేవ కుమార్, బెండి శ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం మాకన్నపురం పంచాయతీ ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ చేతుల మీదుగా బుధవారం బైజూస్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఇదే గ్రామంలో కొత్తగా మంజూరైన సామాజిక పింఛను లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో పిరియా సాయిరాజ్, డాక్టర్ నిమ్మన దాసు, తడక జోగారావు, బుద్దాన శ్రీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీఓ సంఘ క్యాలెండరును ఆవిష్కరించిన మంత్రి ధర్మాన

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: ఏపీ ఎన్జీఓ సంఘం నూతన సంవత్సర టేబుల్ టాప్ క్యాలెండరును రాష్ట్ర రెవిన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావు ఆవిష్కరించారు. ఏపీ ఎన్జీఓ సంఘ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు, జిల్లా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంఘ నేతలు మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రూపొందించిన సంఘ టేబుల్ టాప్ క్యాలెండరును మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాలూకా, టౌన్, జిల్లా సంఘ ఎన్నికలను ఏకగ్రీవంగా జరుపుకోవడంతో పాటు కొద్దిరోజుల్లోనే క్యాలెండరు రూపొందించి తన చేతుల మీదుగా ఆవిష్కరణ చేయడం ఆనందంగా ఉందన్నారు. సంఘ నేతలకు అభినందనలు తెలిపారు. తొలుత మంత్రి ధర్మానను సంఘ నేతలు దుస్సాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, టౌన్ ఎన్జీఓ సంఘ నేతలు కంఠ జయరావు, కాయల. శ్రీనివాసరావు, బడగల పూర్ణచంద్రరావు, టి. సోమేశ్వరరావు, బరకాల నవీన్, శబీనా బేగం, గణపతి తదితరులు పాల్గొన్నారు.

పటిష్టవంతంగా బాలల హక్కుల కమిషన్

విశాలాంధ్ర-ఎచ్చర్ల : బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మరింత పటిష్టవంతంగా పనిచేసేందుకు మేధావులు అవసరమైన సలహాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావును శ్రీకాకుళం నగరం పిఎన్ కాలనీలోనే క్యాంప్ ఆఫీసులో బుధవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను వేసి తో చర్చించారు. కమిషన్ తరపున తీసుకుంటున్న చర్యలను విసీకి ఆయన వివరించారు. కమిషన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తున్న ప్రతిపాదనలపై మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్సిటీల వీసీలతో సమావేశమై వారి సూచనలు సలహాలు తీసుకొని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రతిష్టను మరింత పెంచేలా కృషి చేస్తామని కమిషన్ సభ్యులు సీతారాం చెప్పారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర కో కన్వీనర్ పి శేఖర్, ఫోరం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మొదలవలస వాసుదేవకుమార్ బెందు శ్రీనివాస్ పాల్గొన్నారు.

హాస్పిటల్ పనులు వేగవంతం చేయాలి : కలిశెట్టి

విశాలాంధ్ర-రణస్థలం : మండలం పైడి భీమవరం పరిధిలో పరిశ్రమలలో సుమారు 18వేలకు పైచిలుకు కార్మికులు పనిచేస్తున్నారని, వారి ఆరోగ్య అవసరాల మేరకు 6 కోట్ల వ్యయంతో ఈఎస్ఐ హాస్పిటల్ మంజూరుకాగా ఇంత వరకు నిర్మాణం పూర్తికాలేదని ఎచ్చెర్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఉత్తరాంధ్ర తెలుగుదేశం పార్టీ శిక్షణా తరగతుల మాజీ డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. బుధవారం ఆయన నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణానికి నిర్వహణ, పర్యావేక్షణ లోపంవల్ల ఇంతవరకు నిర్మాణం పూర్తి కాలేదన్నారు. కార్మికులు తాత్కాలిక ఆసుపత్రిపై ఆధారపడవలసి వస్తుందని, ఇంకా పెద్దసమస్య ఐతే విజయ నగరం, విశాఖపట్నం వెళ్ళవలసిన పరిస్థితి ఎదురైతే కార్మికులు చాలా ఇబ్బంది పడుతున్నారని, సత్వరమే అధికారులు స్పందించాలన్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్యని వెంటనే తీసుకొని వెళ్తానని అన్నారు.

దయనీయ పరిస్థితుల్లో రైతాంగం

దున్న కృష్ణారావు, టీడీపీ బీసీ సాధికార సమితి సభ్యులు

విశాలాంధ్ర-పలాస : రైతులు పరిస్థితి దినదిన గండంలా వుంది. చాలా దయనీయా పరిస్థితిల్లో ఉన్నారని, ఒకపక్క ప్రతికూల వాతావరణం, మరో ప్రక్క చేతికి అందిన పంట ప్రభుత్వం సేకరించకపోవడం వలన రైతాంగం తీవ్ర ఇబ్బందుల్లో వుందని టీడీపీ బీసీ సాధికార సమితి సభ్యులు డా. దున్న కృష్ణారావు బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ అనేది మాటల వరకే తప్ప చేతల్లో కనిపించడం లేదన్నారు. మిలర్ల నుండి కూడా ఆశించినంత ఉపయోగం లేదని, ఎన్నో వ్యయ ప్రయాసలు పడి, అప్పులు చేసి పండించిన పంట ఇలా అవ్వ డం రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. పనిలోపనిగా దళారులు చేతి వాటం చూపి అందినకాడికి తక్కువ ధరకే రైతులు దగ్గర దోచుకుంటున్నా రని, కావున ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులు పంటకి గిట్టుబాటు ధర కల్పించి సేకరణ చేయాలనీ టీడీపీ తరుపున డిమాండ్ చేస్తున్నామని దున్న కృష్ణారావు తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-ఆమదాలవలస : మండలంలోని తొగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ ఖాళీలలో గల సబ్జెక్టులు గెస్ట్ లెక్చరర్ పద్ధతిలో నియామకాలకు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాల విద్య కమిషన్ ఆదేశాల మేరకు రాజనీతి శాస్త్రం, గణిత శాస్త్రం, వాణిజ్య శాస్త్రానికి బోధించుటకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు పిజీలో 55శాతం మార్కులు సాధించాలని, నెట్, ఏపీ సెట్, పీహెచ్డీలో అర్హత కలిగిన వారికి ఎంపికలో ప్రాధాన్యత కల్పించడం అని వివరించారు. దరఖాస్తులను కార్యాలయానికి అందించాలని కోరారు. రెండు చెట్ల జిరాక్స్ కాపీలతో, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో 9వ తేదీన 9 గంటలకు దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులు కు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. పొందూరు కళాశాలలోనూ.. పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర సబ్జెక్టును బోధించుటకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుచున్నట్లు ప్రిన్సిపాల్ డి.రామారావు తెలిపారు. ఈనెల 7వ తేదీ నాటికి కళాశాల కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు చెట్ల జిరాక్స్ కాపీలను తీసుకొని హాజరుకావాలని కోరారు. ఎంపిక ప్రక్రియ 9వ తేదీన ఇంటర్వ్యూ పద్ధతిలో ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 9490544914కు సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

యువశక్తి పోస్టర్‌ను విడుదల చేసిన జనసేన నాయకులు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ఈనెల 12వ తేదీన శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో నిర్వహించే యువశక్తి కార్యక్రమం సంబంధించిన పోస్టర్‌ను బుధవారం టెక్కలి నియోజకవర్గ నాయకులు పల్లి కోటేశ్వరరావు కోటబొమ్మాళిలో మండల జనసేన నాయకులు ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి అవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి రోజున జనసేన యువశక్తి కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని, ఉత్తరాంధ్ర వెనుక బాటుతనం, వలసలు పోవాలంటే ఈ కార్యక్రమం విజయవంతం చేసి జనసేనను గెలిపించాలన్నారు. యువత తమ అలోచనల గుర్చి, వారి కష్టాల గుర్చి, భవిష్యత్ గుర్చి గళం వినిపించేలా యువశక్తి కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సభకు విద్యార్థులు, యువత పెద్దసంఖ్యలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు తెలగ వలస ప్రసాద్, చందు, జనార్ధన్, పవన్, శ్రీను, రాజేష్, మండల నాయకుడు ధన్ రాజ్, ప్రసాద్, గణేష్, సాయి, నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ సీఎం ఓఎస్డి కె.ఎన్.ఆర్. పేరిట ఫోన్ కాల్స్ ద్వారా మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : బుడుమూరు నాగరాజు అనే వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఓయేస్డి కె.ఎన్.ఆర్ పేరిట దేశంలో వివిధ కార్పరేట్ కంపెనీల కార్యాలయలుకు ఫోన్ చేసి వర్ధమాన రంజీ క్రికెట్ ఆటగాళ్లకు క్రికెట్ కిట్లు కోసమని నమ్మబలికి ఆయా కంపెనీలకు నగదు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్న బుడుమూరు నాగరాజు అనే వ్యక్తిని బుధవారం అరెస్టు చేయడం జరిగిందని ఎస్పీ జి.ఆర్.రాధిక తెలిపారు. ఇటువంటి మోసపూరత ఫోన్ కాల్స్ పట్ల కార్పరేట్ కంపెనీలు,యజమాన్యలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు చేసే ఇటువంటి ఫోన్ కాల్స్ నమ్మి నగదు బదిలీ చేయవద్దని, విధమైన ఫోన్ కాల్స్ ఎవరికైనా వచ్చినట్లయితే స్థానిక పోలీసులకు తెలపాలని జిల్లా ఎస్పీ జి ఆర్ రాధిక ఓపత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.మంగళవారం జాతీయ రహదారిపై స్కూటీ పై అక్రమంగా గంజాయి తరలిస్తున్న కేసుల్లో టెక్కలి పోలిసులకు పట్టుపడిన బుడుమూరు నాగరాజు అనే వ్యక్తిని విచారించగా కొన్ని నిజాలు వెలుగులోకి వచ్చాయి. చెడు వ్యసనాలకు, విలాస వంతమైన జీవితానికి అలవాటుపడి ఎలాగైనా అక్రమంగా డబ్బు సంపాదించాలని చెడు ఉద్దేశంతో ఈ తరహా మోసాలు చేస్తూ ఇంటర్నెట్లో గూగుల్ సెర్చ్ ద్వారా వివిధ కార్పొరేట్ కంపెనీలు, వాటి సీఈఓలు అయా కంపెనీలు ల్యాండ్ లైన్ ఫోన్ నంబర్స్ జాబితాను సేకరించి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గారి ఓఎస్డి కె నాగేశ్వరరావు పేరుతో పాటుగా, తెలంగాణ రాష్ట్ర మంత్రి కేటిఆర్ పిఏ పేరిట ఫోన్ కాల్స్ చేసి నమ్మబలికి, బెదిరింపులకు పాల్పడి వివిధ కార్పొరేట్ కంపెనీలు సీఈఓ, మేనేజర్ ల వద్ద నుంచి పెద్ద మొత్తంలో లక్షల రూపాయలను తనకు సంబంధించిన అకౌంట్‌లకు ట్రాన్స్ఫర్ చేపించుకుని మోసాలకు పాల్పడ్డాడు. ఇప్పటికే నాగరాజుపై ఆంధ్రప్రదేశ్ లో 15 కేసులు, తెలంగాణ లో 10కేసులు నమోదు అయ్యాయి. బెయిల్ పై బయటకు వచ్చి ఈ విధమైన మోసాలుకు పాల్పడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ విధమైన ఫోను కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని అట్టి సమాచారాన్ని స్థానిక పోలీసులకు అందజేయాలని ఎస్పీ కోరారు.టెక్కలి పోలీస్ వారికి మంగళవారం పట్టుబడిన బుడుమూరు నాగరాజు పై కేసు నమోదు చేసి ఈ దినం రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించడం జరిగినది జిల్లా ఎస్పీ జి ఆర్ రాధిక తెలిపారు.

8 నుంచి సంక్రాంతి సెలవులు

విశాలాంధ్ర-ఎచ్చర్ల: డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి సంక్రాంతి సెలవులు ఈనెల 8 నుంచి 17వ తేదీ వరకు ఇవ్వనున్నట్లు వర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ సిహెచ్ ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వర్సిటీలో విద్యార్థులకు తిరిగి ఈనెల 18వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని చెప్పారు. వర్సిటీలోని కార్యాలయం పబ్లిక్ హాలిడేస్ మినహా యధావిధి గానే పనిచేస్తుందని చెప్పారు. వర్సిటీ అనుబంధ కళాశాలలకు మాత్రం ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు సెలవులని చెప్పారు.

పెన్షన్ల పెంపుతో నూతనోత్సహం

విశాలాంధ్ర-సోంపేట : రాష్ట్ర ప్రభుత్వం జనవరి నుంచి సామాజిక పింఛన్లను 2750 రూపాయలకు పెంచడంతో లబ్ధిదారులల్లో నూతనోత్సహం నెలకొందని రాష్ట్ర మత్స్యకార కార్పోరేషన్ డైరెక్టర్ మద్దు రాజారావు పేర్కొన్నారు. మత్స్యకార గ్రామమైన రామయ్యపట్నంలో ఆయన బుధవారం పలువురుకి పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవర్గాలకు అండగా ఉండి వారికి మేలు చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డికి అందరు అండగా ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో వాలంటీర్లు చింతామణి, షర్మిల పాల్గొన్నారు.

భావనపాడులో ఎమ్మెస్ స్వామినాథన్ బృందం పర్యటన

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం భావనపాడు ఫిషింగ్ హార్బర్‌లో ఎమ్మెస్ స్వామినాథన్ కమిటీ బుధవారం పర్యటించింది. భావనపాడులో మత్స్యకారులకు ఉపయోగపడే ఫిష్ ల్యాండింగ్ వనరులను ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆ కమిటీ ఛైర్మన్ నేతాజీ మాట్లాడుతూ, ఈ వనరులు మత్యకారులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ, ఎఫ్డిఓ పాత్రో, భావనపాడు పంచాయతీ సర్పంచ్, బుడ్డా మోహన్ రెడ్డి, స్థానిక మత్స్య మత్స్యకార సహకార సంఘం సొసైటీ అధ్యక్షులు ఆదినారాయణ, మాజీ అధ్యక్షులు ప్రకాష్, ఫకీరు, ఫిషరీస్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్ర పరిశీలన

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలంలోని మెట్ట పేట గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ సాగు రైతు మెట్ట ధనుంజయ్ రావు కూరగాయల వంటలను రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విభాగం నుండి వచ్చిన నార్త్ జోన్ రీజనల్ అధికారి హేమ సుందర్ గారు సందర్శించారు. కూరగాయలలో అంతర పంటల సాగు మరియు పలు పంటలు ప్రకృతి వ్యవసాయ సేద్య విధానాలను రైతులతో చర్చించి ప్రకృతి వ్యవసాయం చేయడం వలన వచ్చిన దిగుబడులు అలాగే నేలలో మార్పులు, ప్రకృతి సేద్యం లో ఇంకా వినూత్నంగా దిగుబడులు సాధించడానికి అవసరమైన సలహాలు సూచనలు ఆయన రైతులకు అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం మేనేజర్ రేవతి, డిఆర్‌పి శ్రీనివాస్ మరియు రైతులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమ సారథి సీఎం జగన్ : సర్పంచ్



విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాష్ట్రంలో కులమత రాజకీయ బేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చీపుర్లపాడు సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి, ఎంపీటీసీ బొడ్డు అప్పన్నలు అన్నారు. బుధవారం చీపుర్లపాడు సచివాలయంలో నూతనంగా మంజూరైన పించన్లును లబ్ధిదారులకు వారు అందజేశారు. ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీర గున్నమ్మ ఉద్యమాల చరిత్ర అందరూ తెలుసుకోవాలి

ఎంపీపీ ఆట్ల సరోజినమ్మ

విశాలాంధ్ర-టెక్కలి : నాటి జమీందారీ వ్యవస్థను ఎదిరించి పోరాడిన వీర మహిళ వీర గున్నమ్మ ఉద్యమాల చరిత్రను అందరం తెలుసుకోవాలని ఎంపీపీ ఆట్ల సరోజినమ్మ కోరారు. బుధవారం స్థానిక బిఎస్ అండ్ జే ఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలలో చిత్ర బృందం ఏర్పాటు చేసిన ఆడియో, గోడ పత్రిక ఆవిష్కరణ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వీర గున్నమ్మ చరిత్రను ప్రతి ఒక్కరు చూడవలసిన చిత్రమని, ఆమె వీర వనిత అని, వీరగున్నమ్మ చరిత్ర అందరూ తెలుసుకోవాలని అన్నారు. ఉత్తరాంధ్రలో ఉన్న మన శ్రీకాకుళం యాస భాష మాండలికంతో సంభాషణలు ఉంటాయని మన ప్రాంతానికి సంబంధించిన కథ అని వివరించారు. ఈ కార్యక్రమంలో నటులు లఖినాన వెంకటాచలం, డిపి స్టాలిన్ తో పాటు సిపిఐ నాయకులు యర్ల గోపి, అనపాన షణ్ముఖరావు, వైసిపి వైస్ ఎంపీపీ పేడాడ రమేష్, వైసిపి నాయకులు బగాధి హరి, సిపిఎం నాయకులు ఎన్. షణ్ముఖరావు, బిజెపి నాయకులు హెచ్.ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

విశాఖ హాస్పిటల్‌కు వెళ్లి పింఛన్ అందజేత

విశాలాంధ్ర - జలుమూరు : మండలంలోని సైరిగాం పంచాయతీకి చెందిన వితంతువు కోల ఆదిలక్ష్మికి కాలు విరుగగా ఆమె విశాఖపట్నంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వలంటీర్ సుధ, వెల్ఫేర్ అసిస్టెంట్ అనురాధ, సర్పంచ్ ప్రతినిధి ధర్మాన రమణ రమణమూర్తి, వైసీపీ నాయకులు, అల్లాడ పిఎసిఎస్ చైర్పర్సన్ పొన్నాన ముసలి నాయుడు, కే.సీతారాం తదితరులు హాస్పిటల్‌కి వెళ్లి పింఛన్ అందజేశారు. వీరిని గ్రామస్తులు ప్రశంసించారు.

రాష్ట్రమంతటా పింఛన్ల పండగ

ఇచ్ఛాపురం నియోజకవర్గం వైయస్సార్‌సీపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్

విశాలాంధ్ర-కవిటి : రాష్ట్రం అంతటా పింఛన్లు పండగ నిర్వహించబడుతుందని ఇచ్ఛాపురం నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని కవిటి అగ్నికుల క్షత్రియ భవనంలో ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్ అధ్యక్షతన నూతన పింఛన్లును (వైస్సార్ పింఛన్ కానుక) పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏటా పింఛన్లు సొమ్ము పెంచడంతోపాటు నూతన పింఛన్లు మంజూరు చేయడంతో రాష్ట్రంలో పింఛన్లు పండగ జరుగుతుందని అన్నారు. కొత్తగా పింఛన్ సొమ్ము పెరిగిందని, మండలానికి 491 మంది లబ్ధిదారులకు నూతన పింఛన్లు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో రాజకీయ బేధాలు లేకుండా అన్ని పథకాలు అర్హు లైన లబ్ధిదారులకు అందజేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మంజూరైన నూతన పింఛన్‌ను గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ నర్తు రామా రావుతో కలిసి పింఛన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడప్ చైర్మన్ శాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, స్వచ్ఛ భారత్ కార్పోరేషన్ డైరెక్టర్ కృష్ణారావు, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేస్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, కవిటి మేజర్ పంచాయతి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మండల కోఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్, సర్పంచులు ఎస్.పి నారాయణస్వామి, దూగాన భద్రాచలం, సనపల జానకిరావు, మండల అగ్రికల్చర్ కమిటీ చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, వైసిపి నాయకులు ఎలమంచి నీలయ్య, ఎన్ని అశోక్, భార్ల నాగ భూషణం, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచు లు, ఎంపీటీసీలు, కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగన్మోహన్ రెడ్డే ముఖ్యమంత్రి!

వైయస్సార్ పెన్షన్ కానుకలో మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-పోలాకి : ఇటువంటి అభివృద్ధి దేశంలో ఎక్కడా లేదని మళ్లీ ఆంధ్రకు జగన్మోహన్ రెడ్డి సీఎం అవుతారని మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మంగళ వారం ఉరజాం గ్రామంలో వైయస్సార్ పింఛన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జగన్ గెలుపుని దేశంలో అనేక సర్వేలు చెబుతున్నాయని దీంతో ప్రజల్లో పార్టీపట్ల విశ్వాసం పెరిగిందని అన్నారు. జగన్‌పైన అనేక విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాన్ని ఆ భగవంతుడే చూసుకుంటాడని అన్నారు. ఉద్దానం అభివృద్ధి కోసం 700 కోట్ల రూపాయలు అభివృద్ధి కోసం వెచ్చించినట్లు చెప్పారు. డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ అర్హతకలిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అనేక కోట్ల రూపాయలతో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల్లో ఆర్థిక అభివృద్ధి కలిగిస్తున్నట్లు చెప్పారు. మాజీ డిసిసిబి చైర్మన్ డోల జగన్ మాట్లాడుతూ వచ్చే 2024 ఎన్నికలలో 175 ఎంఎల్ఏలు వైఎస్ఆర్ పార్టీ గెలుచుకుంటుందని చెప్పారు. ఆ దిశగా ప్రజల్లో విశ్వాసం కలుగుతుందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఈశ్వరరావు మండల పరిషత్తు మాజీ అధ్యక్షులు దుంపల భాస్కరరావు వైయస్సార్ పార్టీ జిల్లా ప్రసార కార్యదర్శి బార్ల వేణుగోపాలరావు మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కనితి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కనితి సత్తిబాబు మాట్లా డుతూ ధర్మన్న కుటుంబానికి అంకితమవుతామని ఆయన ద్వారా వైఎస్ఆర్ పార్టీకి ఎనలేని సేవ చేస్తామని అన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసిల్దారు శ్రీరాములు గురువిల్లి అప్పారావు కూన డిల్లేశ్వరరావు సాలిన నగేష్ కుమార్ సురపు అప్పారావు మాస్టారు వెలుగు సచివాలయం సిబ్బంది నాగరాజు పలువురు పాల్గొన్నారు.

ఉపాధి పథకం కూలీలకు తల్లివంటిది : డ్వామా పీడీ చిట్టిరాజు

విశాలాంధ్ర-గార : ఉపాధి హామీ పథకం కూలీలకు తల్లి వంటిదని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జీవి చిట్టి రాజు అభివర్ణించారు. బుధవారం గార మండలంలోని తూలుగు, వత్సవలస పంచాయతీల పరిధిలోని ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం అక్కడి కూలీలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం నిబంధనల ప్రకారం రెండు పూటలా ఎనిమిది గంటల సమయం పనిచేయాల్సి ఉందని, కనీసం ఆరు గంటలు సమయం పని చేస్తే గరిష్ట వేతనం రూ. 250 పొందవచ్చునని పిడి అన్నారు. అందరూ వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకోవాలని అన్న ఆయన ఐకమత్యంతో ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలన్నారు. ఇక్కడ మీరే యజమానులు వంటివారని, మీ గ్రామాల అభివృద్ధికి మీరే వారదులు వంటి వారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలస నివారణ, ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకే ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నారని, దీని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా మాత్రమే హాజరు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో పీడీ వెంట ఏపిఓ సంధ్యారాణి, జైనారం నాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ నాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి అందరి సహకారం అవసరం : సర్పంచ్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : కోటబొమ్మాళి మేజరు పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని స్థానిక సర్పంచ్ కాళ్ళ సంజీవరావు అన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బందితో సచివాలయ కార్యదర్శి రఘుపాత్రుని యోగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోగల అన్ని కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తొలితగతిన పరిష్కరించుకుందామని అందుకు ప్రతి ఒక్కరు తమ సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. అనంతరం రెడ్డిక వీధిలో ఉన్న మంచినీటి బావిని, డ్రైనేజీలును పరిశీలించి, మంచినీటి బావిని క్లోరినేషన్ చేసి, బావిచుట్టూ ఉన్న మురికినీరు డ్రేనేజీలకు దారి చూపించి శుభ్రం చేస్తామని కాలని వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనపాన బాలక్రిష్ణ, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో ఓబీసీ కోసం 'ఛలో ఢిల్లీ'

విశాలాంధ్ర-నరసన్నపేట : రాష్ట్రంలోని శిష్టకరణాలను ఓబిసిలో చేర్పించేందుకు కులానికి చెందిన ప్రధాన ప్రతినిధులతో వచ్చే ఫిబ్రవరిలో ఛలో ఢిల్లీ యాత్ర నిర్వహిస్తున్నామని రాష్ట్ర అధ్యక్షులు, పోలిమహంతి ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే మా కులాన్ని ఓబిసిలో చేర్పించేందుకు ముఖ్యమంత్రి, వైఎస్. జగన్మోహన్‌రెడ్డి, జిల్లా వైసిపి అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్ దృష్టికి తీసుకువెళ్ళటం జరిగిందన్నారు. అలాగే ఎం.పి, జి.వి.ఎల్. నరసింహారావును కలిసి ఎన్.సి.బి.ఛైర్మన్‌ను ఢిల్లీలో కుల పరిస్థితులు వివరించామని తెలిపారు. వచ్చే ఫిబ్రవరిలో ఎన్సీబిసి నుండి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించే ఏర్పాటుతోపాటు సంబంధిత కేంద్రమంత్రిని కలిసి, సహకరిస్తామని ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ విషయంలో ఢిల్లీ వచ్చేందుకు ఆసక్తి వున్నవారు తమకు తెలియచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్, సదాశివుని కృష్ణ, సంఘ ప్రతినిధులు, సదాశివుని ప్రభాకరరావు, డి.వి.రఘు, బి.రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన కూలీ రేట్లు అగ్రిమెంట్ చేసి, ఏరియర్స్ చెల్లించాలి

సివిల్ సప్లై హమాలీలు నల్ల బ్యాడ్జీలతో నిరసన



విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : జిల్లాలో సివిల్ సప్లై మండల స్థాయి స్టాక్ పాయింట్లు వద్ద, గోడౌన్ లలో పని చేస్తున్న హమాలీ కార్మికులకు చెల్లించవలసిన పెరిగిన కూలీ రేట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. బుధవారం ఏ.పి.సివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘం రాష్ట్ర యూనియన్ (ఏఐటీయుసి) పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న మండల స్థాయి స్టాక్ పాయింట్ల వద్ద గల సివిల్ సప్లై గోడౌన్‌లలో నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. శ్రీకాకుళం, నరసన్నపేట, కోటబొమ్మాళి, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, కవిటి, జలుమూరు, కొత్తూరు, పొందూరు, జి.సిగడాం, లావేరు, ఆమదాలవలస సివిల్ సప్లై గొడౌన్స్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు బస్తాలు లోడింగ్, అన్ లోడింగ్ చేసేటప్పుడు క్వింటాలు చెల్లించే కూలీ రేట్లుకు సంబంధించి రెండేళ్లకోసారి ఒప్పందం జరిగి ఆ పెరిగిన కూలీ రెట్లు చెల్లింపుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తుంది. ఒప్పందం ప్రకారం కూలీ చెల్లించాలి, క్వింటా లోడింగ్, అన్ లోడింగ్ చేయుటకు గతంలో కంటే మూడు రూపాయిలు అదనంగా చెల్లించాలని ఒప్పందం జరిగింది. పెరిగిన కూలీ రేట్లకు అగ్రిమెంట్ చేయడంలో 12 నెలలు బకాయిలు చెల్లించుటలో నిర్లక్ష్యంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. అరకొర వచ్చిన కూలీ కుటుంబ పోషణకు చాలక దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారు. సివిల్ సప్లై రాష్ట్ర అధికారులకు, యూనియన్ రాష్ట్ర నాయకులకు జరిగిన చర్చల్లో పెండింగ్ బకాయిలు ఎగ్గొట్టుటకు ప్రయత్నాలు జరిగితే, యూనియన్ నాయకులు సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి హమాలీ కార్మికులకు న్యాయం చేయాలని, లేకుంటే భవిష్యత్ కార్యాచరణ ద్వారా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని కార్మికులు, కార్మిక సంఘం నాయకులు హెచ్చరించారు. ఈ నిరసన కార్య క్రమాలను సంఘం జిల్లా అధ్యక్షులు కె.శ్రీమన్నా రాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చిక్కాల గోవింద రావు తదితరుల పర్యవేక్షణలో జరిగాయి. 6వ తేదీన సివిల్ సప్లై డీఎం కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు హమాలీలు హాజరై ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిలుపునిచ్చారు.

తీసుకునే ఆహారమే ఆరోగ్యం

విశాలాంధ్ర-పలాస : మీరు తీసుకునే ఆహారమే మీ ఆరోగ్యమని, ఆహారం విషయంలో తీసుకునే జాగ్రత్తలతో ఆరోగ్యం మీ చేతుల్లో ఉంటుందని ప్రభుత్వ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ ఎల్. సుబ్రమణ్యం అన్నారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన బుధవారం ప్రకృతి వైద్యం పై విద్యార్థులకు అవగాహన కలిగించారు. మన చుట్టూ ఉన్న ప్రకృతిలో అనేక వ్యాధులకు మందులున్నాయని, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పి.చిరంజీవులు, అధ్యాపకులు ఈ కార్యక్రమంలో ఉన్నారు.

కణితి తవుడు ఇక లేరు

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-పోలాకి : పోలాకి మండలం ఉరజాం గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు కణితి తవుడు (82) బుధవారం వేకువజామున మృతి చెందారు. గతంలో ఈయన కాంగ్రెస్ పార్టీ నాయకునిగా ఎన్నో సేవలు అందించారు. ఉరజాం పంచాయితీకి సుదీర్ఘకాలం ఏకగ్రీవ సర్పంచ్ గా బాధ్యతలు నిర్వహించారు. పోలాకి పీఏసీఎస్ నకు దశాబ్దకాలం పాటు ఉపాధ్యక్షునిగా పనిచేశారు. ఆయన ఇటీవల అనారోగ్యానికి గురికావటంతో విశాఖపట్నంలోని ఒక ఆసుపత్రిలో కుటుంబసభ్యులు చికిత్స చేయించారు. ఈయనకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. వీరిలో ఒక కుమారుడు సత్తిబాబు ఉరజాం గ్రామపంచాయతీ సర్పంచ్ గా సేవలు అందిస్తున్నారు. ఈయన సోదరుడు కణితి కృష్ణరావు మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షునిగా ఉన్నారు. విలువలు, విశ్వసనీయతలే శ్వాస గా ధర్మాన కుటుంబ నాయకత్వానికి కట్టుబడి, పోలాకి మండలంలో బలమైన కాంగ్రెస్ వాదిగా ముద్రపడిన కణితి తవుడు మృతి పట్ల మాజీ డిప్యూటీ సీఎం, సీనియర్ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ విచారం వ్యక్తం చేశారు. తవుడు అంత్యక్రియల్లో కృష్ణదాస్ పాల్గొన్నారు. పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

కణితి తవుడు మృతి తీరని లోటు... పోలాకి మండల సీనియర్ నాయకుడు కణితి తవుడు మృతి మండల పార్టీకి తీరని లోటు అని జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కష్టకాలంలో ఉన్నపుడు ఆయన ఇచ్చిన ధైర్యం, రాజకీయాల్లోకి వచ్చిన సమయంలో ఆశీస్సులు కోరి వెళ్ళినపుడు చెప్పిన మాటలు ఇంకా గుర్తు ఉన్నాయి. అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతున్నానని చెప్పారు.